రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

సుభాష్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కుతాడి శివరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30 నిర్వహించే రాష్ట్ర సదస్సులో పలు సమస్యలులపై చర్చించున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కాసిపాక అజయ్, ఎరుకల సంఘం జిల్లా అధ్యక్షుడు కె శ్రీనివాస్, తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ చంటిశ్రీనివాస్, ఎస్ సురేష్, సుంకె గంగయ్య, రమేశ్ పాల్గొన్నారు.

- ఈ విద్యా సంవత్సరం నుంచి అమలు
- స్మార్ట్ కార్డు ఆధారంగా ఫోన్ చేసుకునే సదుపాయం
- తల్లిదండ్రులతో విద్యార్థులు మాట్లాడుకునే అవకాశం

గురుకులాల్లో ఫోన్‌మిత్ర



గురుకులాల్లో అమర్చనున్న స్మార్ట్ కార్డు ఫోన్లు

భగత్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో కొత్తగా ఫోన్‌మిత్ర కార్యక్రమానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇక విద్యార్థులు ఇంటిపై బెంగపెట్టుకోకుండా తమ తల్లిదండ్రులతో మాట్లాడవచ్చు. గురుకులంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా సంబంధిత ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లవచ్చు.

ఈ ప్రక్రియ ప్రస్తుత విద్యాసంవత్సరం ప్రారంభం నుంచే అమలయ్యే విధంగా సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ చర్యలు చేపట్టింది. ఈ మేరకు గురుకులాల్లో ఫోన్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటారు. కొన్ని గురుకులాల్లో ఫోన్లను ఇప్పటికే బిగించగా మిగిలిన గురుకుల విద్యాలయాల్లో వేగవంతం చేశారు.



● నలుగురు విద్యార్థులకు ఒక స్మార్ట్‌కార్డు

గురుకుల విద్యార్థులు హౌజ్ మాస్టర్ తో సంబంధం లేకుండా నేరుగా స్మార్ట్‌కార్డు ఆధారంగా ఫోన్ చేసి మాట్లాడుకోవచ్చు. నలుగురు విద్యార్థులకు కలిపి ఒక్కో స్మార్ట్ కార్డు అందజేస్తారు. ఆ కార్డుతో నిర్దేశించిన సమయం పాటు తల్లిదండ్రులతో మాట్లాడుకోవచ్చు. ఇష్టం వచ్చిన నంబర్లకు కాకుండా కుటుంబ సభ్యులకు చెందిన ఒక ఫోన్ నంబరు మాత్రమే కాల్ వెళ్తుంది. వేరే ఇతర ఫోన్ నంబర్లకు కాల్ చేయడానికి అవకాశం ఉండదు. గురుకుల విద్యాలయాల సంస్థ టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసుకోవడానికి అవకాశం ఉంటుంది. గురుకు లంలో ఏమైనా సమస్యలు ఉంటే నేరుగా సంబంధిత ఉన్నతాధికారులకు విన్నవించే అవకాశం ఫోన్ మిత్ర ద్వారా విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చారు. తల్లిదండ్రులకు ఫోన్ చేయడానికి ఇప్పటి వరకు క్లాస్ హౌస్ మాస్టర్ లేదా ప్రిన్సిపాల్ అడిగాల్సి ఉండేది. లేదా ఎవరైనా పేరెంట్ గురుకులానికి వెళ్తే వారిని బతిమాలి ఫోన్ చేసేవారు.

● విద్యార్థుల సంఖ్య మేరకు ఫోన్లు

గురుకుల విద్యాలయాల్లో విద్యార్థుల సంఖ్యను బట్టి ఫోన్లను ఏర్పాటు చేస్తారు. విద్యార్థుల సంఖ్య మేరకు స్మార్ట్ కార్డులు గురుకులాలకు సరఫరా అయ్యాయి. అవసరమైతే మరిన్ని స్మార్ట్ కార్డులు, ఫోన్లను అందజేయడానికి గురుకుల సొసైటీ సిద్ధంగా ఉన్నట్లు సమాచారం. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల మాదిరిగా సంక్షేమ గురుకులాల్లోనూ ఫోన్లు ఏర్పాటు చేయడంపై విద్యార్థులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి'

మానకొండూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల కంటే ముందే పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నింటిని విడుదల చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి కొహెడ చంద్రమౌళి రాష్ట్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. డీటీ ఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రమౌళి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీసీఎఫ్, సరెండర్ లీవ్, టీఎస్ జీఎల్ఐ ఉద్యోగ విరమణ పొందిన వారి బెని ఫిట్స్ అన్నింటిని విడుదల చేయాలని కోరారు. పాఠశాల విద్యారంగంలో అన్ని స్థాయిల్లో ఖాళీగా ఉన్న జిల్లా విద్యాధికారులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులతో పాటు పర్యవేక్షక పోస్టులనుభర్తీ చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి ఆర్ శంకర్, మండల అధ్యక్ష, కార్యదర్శు లు భుజన్ చందర్, మహేందర్‌రెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలి

హుజూరాబాద్‌రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ప్రారంభమైనందున గ్రామాల్లో మొక్కలు నాటడంపై అధికారులు దృష్టి పెట్టి వనమహోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఉప్పుల శ్రీధర్ అన్నారు. పట్టణంలోని ఎంపీ డీవో కార్యాలయంలో హుజూరాబాద్, సైదా పూర్, శంకరపట్నం మండలాలలకు చెందిన ఎంపీడీవోలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపా ధిహామీ సిబ్బందితో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మొక్కలు నాటే ప్రాంతాన్ని గుర్తించాలన్నారు. ఎండిపోయిన మొక్కల స్థానంలో కొత్త మొక్కలను విద్యుత్తు తీగలకు దూరంగా నాటాలన్నారు. గ్రామంలో నాటే ప్రతి మొక్కకు లెక్క పక్కాగా ఉండేలా చూసుకోవాలన్నారు. హార్టికల్చర్ ద్వారా రైతులకు పండ్ల మొక్కలను అందజేయాలన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమా వేశంలో సహాయ గ్రామీణ అభివృద్ధి అధికారి కృష్ణ, ప్లాంటేషన్ సూపర్‌వైజర్ సత్యనారాయణ, ఎంపీడీవోలు సునీత, యాదగిరి, కృష్ణప్రసాద్, మండల పంచాయతీ అధికారులు సతీష్‌రావు, బషీరుద్దీన్, ప్రభాకర్ పాల్గొన్నారు.

రైతుల కోసం పలు యాప్‌లు

- వర్షాలపై ముందస్తు సమాచారం
- ఎప్పటికప్పుడు వాతావరణ వివరాల అందజేత

5

బీఆర్‌ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యం

- టీపీసీసీ సమన్వయకర్త మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్
- కులగణన విషయంలో హామీని నిలబెట్టుకున్నాం
- టీపీసీసీ సమన్వయ కర్త ఆడమ్ రాజ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి ఫక్రుద్దీన్

కరీంనగర్ అర్బన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో విద్యారంగం నిర్వీర్యమైందని టీపీసీసీ సమన్వయకర్త మహమ్మద్ ఖాజా ఫక్రుద్దీన్ అన్నారు. కరీంనగర్ పార్లమెంట్ ఇన్‌చార్జిలుగా నియమితులైన ఖాజా ఫక్రుద్దీన్, ఆడమ్‌రాజ్ మొదటిసారి మంగళవారం డీసీసీ కార్యాలయానికి వచ్చారు. ఈ సందర్భంగా వారికి కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. అనంతరం డీసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖాజా ఫక్రుద్దీన్ మాట్లాడుతూ 4న హైదరాబాద్ ఎల్‌బీ స్టేడియంలో బహిరంగ సభ ఏర్పాటు చేశామని, ఈ సభకు ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్నారని తెలిపారు. పార్టీ కోసం కష్టపడ్డవారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్లు కేటాయిస్తామన్నారు. టీపీసీసీ సమన్వయకర్త ఆడమ్ రాజ్ మాట్లాడుతూ కులగణన విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీని నిలబెట్టుకుందన్నారు. హైదరాబాద్ సభకు పెద్దఎత్తున కాంగ్రెస్‌శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులతో 4న నిర్వహిస్తున్న సభను విజయవంతం చేయాలన్నారు. కాంగ్రెస్ నగర అధ్యక్షుడు, సుడాచైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్‌తోపాటు జిల్లాలోని ప్రతి గ్రామం నుంచి జులై 4న ఎల్‌బీ స్టేడియంలో జరుగనున్న సభకు పెద్ద ఎత్తున తరలి వెళ్తున్నామన్నారు. బీజేపీ, బీఆర్ఎస్ శవాలపై ప్యాలాలు ఏరుకుంటున్నట్లుగా వ్యవహరిస్తున్నారన్నారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మాట్లాడుతూ దేశంలోనే మొట్ట మొదటిసారిగా కులగణన చేపట్టిందన్నారు. సమావేశంలో మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్ర సత్యప్రసన్న వెంకటరాంరెడ్డి, అర్బన్ బ్యాంక్ చైర్మన్ గడ్డం విలాస్‌రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజ్‌హుస్సేన్, బెజ్జంకి మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, బెజ్జంకి మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, మోహనాచారి, వెన్న రాజమల్లయ్య పాల్గొన్నారు.

● ఇందిరమ్మ కమిటీలెక్కడ?

ఇందిరమ్మ కమిటీల ఏర్పా చేయకుండా జాప్యం ఎందుకు చేస్తున్నారంటూ విలేకరులు ప్రశ్నించగా ఇన్‌చార్జి మంత్రి అనారోగ్యం, మరిన్ని కారణాలతో జాప్యం జరిగిందని డీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. ఇందిరమ్మ కమిటీల కోసం రెండు జాబితాలు ఇన్‌చార్జి మంత్రి వద్దకు చేరిన విషయం నిజమేనన్నారు. ఇంటిరమ్మ కమిటీల ఏర్పాటుపై కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు కొందరు వేదిక కింద నుంచి ప్రశ్నించగా వారిని నాయకులు అడ్డుకున్నారు. ముందుగా కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి నియామకం చేయాలంటూ కొందరు నినాదాలు చేశారు. విలేకరుల సమావేశం అనంతరం బహిరంగ సభ సన్నాహక సమావేశంలోనూ కొందరు కాంగ్రెస్‌పార్టీ గ్రామ, మండల నాయకులు ఈ రెండు అంశాలను ప్రస్తావించేందుకు ప్రయత్నించగా సుడా చైర్మన్ నరేందర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఈ సన్నాహక సమావేశం లో కేవలం సభకు సంబందించినదని, ఇతర విషయాలు లేవనెత్తొద్దని సూచించారు.

● ప్రతి ఒక్కరూ బాధ్యతగా సభకు తరలిరావాలి...

హైదరాబాద్ లాల్ బహదూర్ స్టేడియంలో జులై 4న జరిగే సభకు ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త బాధ్యతగా తరలిరావాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శులు మహమ్మద్ ఖాజాఫక్రుద్దీన్, ఆడమ్‌రాజ్ అన్నారు. సభ సన్నాహక సమావేశంలో వారు మాట్లాడారు. ఈ సమావేశంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జునఖర్గేతోపాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరవుతారన్నారు.

మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

మానకొండూర్, జూలై 1: మహిళలందరు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి సూచించారు. మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్య మహిళా , జాతీయ వైద్యుల దినోత్సవం, ఆశా డే కార్యక్రమాలు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహిళలు ప్రతి రోజు పాలు, గ్రుడ్లు, ఆకు కూరలు, కూరగాయలు తినాలని అన్నారు. ఆసుపత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. అంతకు ముందు ఆసుపత్రిలోని సిబ్బంది హాజరుపట్టిక, ఆపరేషన్ థియేటర్, ల్యాబ్, లేబర్‌రూం, ఫార్మసీ గదులను పరిశీలించారు. అనంతరం గ్రామంలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించి వేగవంతంగా నిర్మాణాలు పూర్తి అయ్యేలా చూడాలని అధికారులను ఆదేశించారు. భవిత కేంద్రాన్ని సందర్శించి పిల్లలతో ముచ్చటించారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. గ్రామపంచాయితీ ప్రక్కన గత నర్సరీని సందర్శించి ఎన్ని రకాలుఅందుబాటులో ఉన్నాయని సంబంధిత అధికారులను అడిగారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో వెంకటరమణ, అడిషనల్ డీఎంహెచ్‌వో సుధారాజేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాజిదా అతహరి, ఎంపీడీవో వరలక్ష్మి, ఎంపీవో కిరణ్‌కుమార్, పీహెచ్‌సీ వైద్యుడు ఎండీ సల్మాన్, సీహెచ్‌వో రాజునాయక్ పాల్గొన్నారు.



మానకొండూర్ పిహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

నీరు నిలువకుండా చర్యలు తీసుకోవాలి

కరీంనగర్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలో ఖాళీ స్థలాలు, రోడ్లపై వర్షం నీరు నిలువకుండా పారిశుధ్య అధికారులు, సిబ్బంది ప్రత్యేక చర్యలు తీసుకో వాలని నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆదేశించారు. మంగళవారం కమిషనగర్ నగరంలో పర్యటించారు. పెదపల్లి బైపాస్ రోడ్డుతోపాటు పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేచేశారు. అనంతరం అల్గునూరు ప్రాంతంలోని డ్యాం ఆనకట్ట సమీపంలో నగరపాలక సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన ప్రకృతి వనంలో నర్సరీని సందర్శించారు. నగరపా లక సంస్థ ద్వారా చేపట్టనున్న వన˘హోత్సవ కార్యక్రమానికి మొక్కలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ రెండు రోజులుగా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నగరంలో పారిశుధ్య పనులను మరింత మెరుగ్గా చేయాలన్నారు. జంక్షన్ల వద్ద చెత్తాచెదారం తొలగించి డ్రైనేజీల్లో నీరు వెళ్లేలా చూడాలన్నారు. దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వర్షాకాలంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, నగర ప్రజలకు ఎలాంటి ఎక్కడ ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.



నగరంలో పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ ప్రఫుల్ దేశాయ్

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని అధికారులను కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరంలో ప్రమాదాల జరిగే ప్రాంతాలను, జిల్లా యంత్రాంగం తరపున తీసుకోవాల్సిన చర్యలను పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలని రోడ్లు భవనాలశాఖ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో యూటర్న్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ అత్యాధునిక కెమెరాల సహాయంతో ట్రాఫిక్ పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. నిబంధనలు పాటించని వాహనాలను ఈ కెమెరాలు ఆటోమేటిక్‌గా గుర్తిస్తాయని, వాహనదారులపై ట్రాఫిక్ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్, ఆర్టీఏ మెంబర్ పడాల రాహుల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి

● మాదక ద్రవ్యాల నిర్మూలనకు చర్యలు

మాదకద్రవ్యాల నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకో వాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మంగళవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా స్థాయి నార్కో కో-ఆర్డినేటర్ సెంటర్ కమిటీ సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పోలీస్, ఎక్సైజ్ అధికారులు సమన్వయంతో పని చేస్తూ జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దాలన్నారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ మాదక ద్రవ్యాల నియంత్రణకు విస్తృత తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. డ్రగ్ టెస్ట్ కిట్ల ద్వారా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని, అవసర మైతే డాగ్ స్క్వాడ్ వినియోగిస్తామని తెలి పారు. జిల్లాలో ఈ ఏడాది 13 కేసులు నమోదు చేశామని, 13.8 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు.

● బాలలను తల్లిదండ్రుల చెంతకు చేర్చండి...

ఆపరేషన్ ముస్కాన్ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బాల బాలికలను పని నుంచి విముక్తి కల్పించి తల్లిదండ్రుల చెంతకు చేర్చాలన్నారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా అన్ని పని ప్రదేశాల్లో బాలబాలికలను గుర్తించాలని, వారికి పని నుంచి విముక్తి కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌చార్జి డీడబ్ల్యూవో సబిత, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ధనలక్ష్మి, డీఈవో మొండయ్య, డీసీపీవో పర్వీన్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా లో లెవెల్ వంతెనలు

- వర్షాకాలంలో వాగులు దాటాలంటే ఇబ్బందులు
- ప్రజల విన్నపాలు పట్టని ప్రభుత్వాలు

5

మర్కట విన్యాసాలు

కలెక్టరేట్‌కు వచ్చే వారిని అలరించాలనుకుందేమో.. ఓ వానరం రకరకాల విన్యాసాలు చేసింది. కాసేపు తలకిందులుగా.. కాసేపు తీగలపై ఎగబాకుతూ వింత చేష్టలు చేసింది. ఈ దృశ్యాలను కలెక్టరేట్‌లో 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి కరీంనగర్

• తలకిందులుగా ఉందే..



• ఎవరైనా చూస్తున్నారా..



• అందరూ.. ఇటే చూస్తున్నారు..



• ఎటైనా వెళ్లిపోతా..



అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): మల్యాల మండలం మద్దుట్లకు చెందిన నల్లూరి తిరుపతి(51) అప్పుల బాధతో మంగళవారం ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతి ఎడమ కాలుకు కొన్నేళ్ల క్రితం గాయం కాగా దాని చికిత్స కోసం, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేశాడు. తిరుపతి అప్పులు తీర్చలేక మంగళవారం గ్రామ శివారులో ఉరి వేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి భార్య దేవేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన డ్రైవర్‌పై కేసు

ఎల్లారెడ్డిపేట, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామ శివారులోని కామారెడ్డి-సిరిసిల్ల ప్రధాన రహదారిపై అతివేగంతో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైన సంఘటనలో వరంగల్ జిల్లాకు చెందిన వాహన డ్రైవర్ వెంకటేశ్‌పై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి మంగళవారం తెలిపారు. వెంకటేశ్ తన బొలెరో వాహనంతో రగుడు బైపాస్ రోడ్డు నుంచి వెంకటాపూర్ మీదుగా కామారెడ్డి వైపు వెళుతున్నాడని పేర్కొన్నారు. వెంకటాపూర్ మూల మలుపు వద్ద వాహనం అదుపు తప్పి ఎదురుగా ఉన్న చెట్టుకు ఢీకొట్టినట్లు తెలిపారు. వెంకటేశ్ తన వాహనంతో తమ ఇంటి ముందు ఉన్న చెట్టును ఢీకొనడంతో తాము భయాందోళనకు గురయ్యామని బాధితురాలు వాగుమడి వెంకటలక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని ఎస్ఐ రాహుల్‌రెడ్డి వివరించారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని బాలుడి మృతి

పెద్దపల్లిటౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి బస్టాండ్ వద్ద సోమవారం ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో చికిత్స పొందుతూ బాలుడు మృతి చెందాడు. జూలపల్లి మండలం కుమ్మరికుంటకు చెందిన అవునూరి నితిన్ (17) చిన్నబొంకూర్‌కు చెందిన అన్వేష్ (19) రైల్వేస్టేషన్‌వైపు వెళ్లి వస్తుండగా బస్టాండ్ ఎంట్రెన్స్ వద్ద ఆర్టీసీ బస్సు ఇద్దరిని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నితిన్ తలకు తీవ్రగాయాలు కాగా అన్వేష్ స్వల్పంగా గాయపడ్డాడు. స్థానికులు వెంటనే 108కు ఫోన్ చేసి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న కుటుంబీకులు ఆస్పత్రి చేరుకొని మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ నితిన్ మంగళవారం తెల్లవారు జామున మృతి చెందారు. తండ్రి భూమయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రైల్వే ట్రాక్ వద్ద గేజ్‌ను ఢీకొన్న లారీ


రైల్వే గేటు వద్ద విరిగిపడిన గేజ్

కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ శివారు తీగలగుట్టపల్లి రైల్వే గేటు వద్ద ఏర్పాటు చేసిన గేజ్‌ను సోమవారం లారీ ఢీకొనడంతో విరిగిపడింది. చొప్పదండి వెళ్లే ప్రధాన రహదారిపై ఉన్న రైల్వే గేటును ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనుల్లో భాగంగా పక్కన ఏర్పాటు చేశారు. భారీ వాహనాలు రాకుండా గేజ్ నిర్మాణం చేపట్టారు. లోడ్‌తో వెళ్తున్న లారీ గేజ్‌ను తాకడంతో విరిగి పడింది. ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో జనం ఊపిరి పీల్చుకున్నారు.

ట్రాక్టర్ ఢీకొని ఒకరికి గాయాలు

వీణవంక, జూలై1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన నందిపేట కొంరయ్యను ట్రాక్టర్ ఢీకొనడంతో గాయపడ్డాడు. మంగళవారం పొలం పనులు ముగించుకొని సైకిల్‌పై ఇంటికి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన రాధారపు అనిల్ ట్రాక్టర్‌తో ఢీకొట్టగా తీవ్రంగా గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని 108 వాహనంలో కొంరయ్యను జమ్మికుంట ఆసుపత్రికి తరలించారు. ట్రాక్టర్ డ్రైవర్ అనిల్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాట్టు ఎస్ఐ ఆవుల తిరుపతి తెలిపారు.

పోతిరెడ్డిపల్లిలో లారీ డ్రైవర్ల ధర్నా


పోతిరెడ్డిపల్లి ఇసుక క్వారీలో ధర్నా చేస్తున్న లారీ డ్రైవర్లు

వీణవంక,జూలై01(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోతిరెడ్డిపల్లి మానేరు వాగులోని ఇసుక క్వారీలో లారీ డ్రైవర్లు ధర్నా చేపట్టారు. నాలుగు రోజులుగా తాము క్వారీల వద్దే ఉంటున్నామని క్వారీ యాజమాన్యం ఇసుక లోడ్ చేయకుండా ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. ఆన్‌లైన్‌లో బుకింగ్‌లు రావడంతో తాము క్వారీల వద్దకు వస్తే లారీలలో ఇసుక లోడ్ చేయకుండా రోజుల తరబడి వేచి ఉండాల్సి వస్తుందని అన్నారు. ప్రతి లారీకి వెయ్యి నుంచి రెండు వేలు ఇస్తేనే లారీలు లోడ్ చేస్తున్నారని ఆరోపించారు. అధికారుల పర్యవేక్షణ లేక క్వారీల యాజామాన్యం ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు.ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మైనింగ్ అధికారులు సమస్య పరిష్కరించాలని కోరారు.

కొండగట్టులో గుర్తు తెలియని వ్యక్తి మృతి

మల్యాల, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొండగట్టు స్టేజీ వద్ద గుర్తు తెలియని వ్యక్తి(60) మృతి చెందినట్లు ఎస్సై నరేశ్‌కుమార్ తెలిపారు. తమిళనాడు ప్రాంతం నుంచి వచ్చిన అతను కూలి పనులకు వెళ్తుండేవాడని స్థానికులు తెలిపారు. మంగళవారం బస్టాండ్ ప్రాంతంలో మృతి చెంది ఉండడంతో పోలీసులకు సమాచారం అందించారు. ముత్యంపేట గ్రామపంచాయతీ కారోబార్ రాజేశ్వర్‌రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

నారు మడిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు



కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వరి సాగుకు కరీంనగర్ మండలంలో వాతావరణ పరిస్థితులు బట్టి ఇప్పటికే పలువురు రైతులు నార్లు పోసుకున్నారు. వర్షాలు ప్రస్తుతం సమృద్ధిగా కురుస్తుండటంతో రైతులు సాగుకు సిద్ధమవుతున్నారు. ఈ సమయంలో వరి నారు పెంపకంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయ శాఖ అధికారులు సూచిస్తున్నారు. నారు మడిని బాగా దున్ని రెండు నుంచి మూడు సార్లు దుమ్ము చేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి తీయడానికి వీలుగా కాలువలు ఏర్పాటు చేసుకోవాలి. రెండు గుంటల నారుమడికి రెండు కిలోల నత్రజని (కిలో విత్తనం చల్లే ముందు, మరో కిలో విత్తిన 12-14 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్‌నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. పశువుల పేడా లేదా ఇతర సేంద్రియ ఎరువులను దుక్కిలో వేయాలి.

మొలకొచ్చిన విత్తనాన్ని చల్లి, మొదట్లో (వారం రోజులు) ఆరు తడులు ఇచ్చి తర్వాత మొక్క దశలో పలుచగా నీరు ఉండేలా చూడాలి. లీటర్ నీటికి రెండు గ్రాముల జింక్ సల్ఫేట్ కలిపి పిచికారి చేయాలి. నారు తీసే ఏడు రోజుల ముందు గుంట మడికి 400 గ్రాముల కార్బోఫ్యూరన్ -3జీ గుళికలను ఇసుకలో కలిపి చల్లి పలుచగా నీరు ఉంచాలి. అవసరాన్ని బట్టి మడిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నాటు వేసేందుకు 15 రోజుల ముందు నుంచే పొలాన్ని దుమ్ము చేయాలి.

● నాటు వేసేటప్పుడు..

నాలుగైదు ఆకులున్న నారును నాటుకోవాలి. చౌడు పొలాల్లో లేతనారు వేయవద్దు. నాటిన తర్వాత ప్రతి రెండు మీటర్లకు 30 సెంటీమీటర్ల చొప్పున బాటలు తీస్తే పైరుకు గాలి వెలుతురు బాగా సోకి చీడ పీడల ఉధృతి అదుపులో ఉంటుంది. ముదిరిన నారైతే కుదురుకు 6 నుంచి 8 మొక్కల చొప్పున నాటాలి. ముదురు రంగు నారు నాటిన ప్పుడు నత్రజని ఎరువును సిఫార్సు కంటే 25 శాతం పెంచాలి.

జాతీయ రహదారి పనులు అడ్డగింత

● నష్టపరిహారం పెంచి ఇవ్వాలని రైతు డిమాండ్


చెంజర్లలో అధికారులను వేడుకుంటున్న రైతు కుమార్

మానకొండూర్, జులై 1 (ఆంధ్రజ్యోతి) : మానకొండూర్ మండలంలోని చెంజర్ల గ్రామానికి చెందిన కానిగంటి కుమార్ అనే రైతు తమకు నష్టపరిహారం తక్కువగా ఇచ్చారని రహదారి నిర్మాణ పనులను మంగళవారం అడ్డుకున్నారు. జాతీయ రహదారి 563 నిర్మాణం కోసం జగిత్యాల నుంచి వరంగల్ వరకు అధికారులు భూసేకరణ చేశారు. మానకొండూర్, అన్నారం, ముంజంపల్లి, ఈదులగట్టెపల్లి, చెంజర్ల, గట్టుదుద్దెనపల్లి గ్రామాలకు చెందిన రైతుల భూములను అధికారులు భూసేకరణ చేశారు. ప్రభుత్వం గుంటకు రూ. 63వేలు నష్టపరిహారం కింద పంపిణీ చేసింది. సుడా పరిధిలో లేని గ్రామాలకు రెండు లక్షలకు పైగా చెల్లించిన అధికారులు సుడా పరిధిలో ఉన్న చెంజర్ల గ్రామ రైతులకు రూ.63వేలు చెల్లించారని రైతు ఆవేదన వ్యక్తం చేశారు. రహదారి పనులను అడ్డుకోవడంతో ఆర్డీవో మహేశ్వర్, తహశీల్దార్ విజయ్‌కుమార్, సీఐలు సంజీవ్, సదన్‌కుమార్‌తో పాటు పోలీసులు అక్కడికి చేరుకున్నారు. తనకు న్యాయం జరిగేంత వరకు పనులు చేయనివ్వనని అడ్డుకున్నాడు దీంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం అధికారులు పనులను కొనసాగించారు.

పట్టా రద్దు చేయాలని కలెక్టర్‌కు వృద్ధురాలి ఫిర్యాదు


ఫిర్యాదు కాపీ చూపుతున్న శాంతమ్మ

శంకరపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మోసపూరితంగా భూమిని పట్టా చేసుకున్నారని ఆ వ్యక్తి రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి కాంతమ్మ కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. బాధిరాలు చింతిరెడ్డి శాంతమ్మ మంగళవారం విలేకరుల ఎదుట తమ గోడు వెళ్లబోసుకుంది. శంకరపట్నం మండలం కన్నాపూర్ గ్రామానికి చెందిన చింతిరెడ్డి శాంతమ్మ-పుల్లారెడ్డిలకు సంతానం లేకపోవడంతో దగ్గరి బంధువైన గూడెపు సంతోష్‌రెడ్డి జీవితాంతం మిమ్మల్ని కంటికి రెప్పలా చూసుకుంటామని వృద్ధాప్యంలో అండగా ఉంటానని నమ్మబలికించాడు. అతని మాటలు నమ్మి రిజిస్ట్రేషన్ చేశామని శాంతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా తమకు డబ్బులు ఇవ్వకుండా, డబ్బులు ఇచ్చి కొనుగోలు చేసినట్లు డాక్యుమెంట్ తయారు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని ఆరోపించారు. కాగా కొన్నేళ్ల క్రితం తన భర్త పుల్లారెడ్డి మరణించగా, ఒంటరిగా ఉంటున్న శాంతమ్మ ఆలనాపాలన చూసుకోకుండా తమ ఏడెకరాల భూమిని సంతోష్‌రెడ్డి తన పేరిట పట్టా చేయించుకున్నాడని దానిని రద్దు చేయాలన్నారు.

ముగ్గురి బైండోవర్

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్న కేసులో దర్శనాల లక్ష్మణ్, నాగపురి శ్రీనివాస్, దాసరి వినయ్‌కుమార్‌ను బైండోవర్ చేసినట్లు కరీంనగర్ రూరల్ సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ముగ్గురిని మంగళవారం కరీంనగర్ రూరల్ తహసీల్దార్ ఎదుట హాజరుపర్చినట్లు, సొంత పూచీకత్తుపై విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

● తీగలగుట్టపల్లిలో తానిపర్తి శ్రీధర్‌రావు, కేసరి సంపత్‌కుమార్‌లు అనుమానాస్పదంగా తిరుగూ కనిపించగా వారిని అదుపులోకి తీసుకుని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు.

పోక్సో కేసులో 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

సుల్తానాబాద్, జూలై 1 (ఆంధ్రజోతి): పెళ్లి పేరుతో యువతిని లోబరుచుకుని కిడ్నాప్ చేసి వేరే ప్రాంతానికి తీసుకెళ్లి అత్యాచారం చేసిన నేరస్తుడికి పెద్దపల్లి ఫాస్ట్‌ట్రాక్ స్పెషల్ కోర్టు జడ్జి సునిత పదేళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రెండు వేల రూపాయల జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పునిచ్చారు. సుల్తానాబాద్ ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ పట్టణానికి చెందిన ఓ యువతి ఇంటర్ పూర్తి చేసి ఓ ఫ్యాక్టరీలో పనికి వెళుతోంది. రోజూ ఫ్యాక్టరీకి వెళ్తున్న క్రమంలో షేక్ అన్వర్ అలియాస్ కట్ట అన్వర్ ప్రేమిస్తున్నానంటూ యువతి వెంటపడ్డాడు. విషయాన్ని యువతి తల్లికి తెలుపగా కూతురుకు సర్దిచెప్పింది. 2018లో యువతి తల్లి పనికి వెళ్లగా ఇదే అదనుగా భావించిన అన్వర్ యువతి ఇంటికి వెళ్లి ఆటోలో పెద్దపల్లికి అక్కడి నుంచి రైలులో కాగజ్‌నగర్ తీసుకువెళ్లాడు. అక్కడ అన్వర్‌కు తెలిసిన ఒకరి ఇంటిలో యువతితో ఉన్నాడు. పెళ్లి చేసుకుంటానంటూ యువతిని లోబరుచుకున్నాడు. పెళ్లి విషయం దాటవేస్తుండడంతో వారం రోజుల అనంతరం యువతి తల్లికి సమాచారం ఇచ్చింది. తల్లి కాగజ్‌నగర్‌కు చేరుకుని కూతురును తీసుకుని జరిగిన అన్యాయం గురించి పోలీసులను ఆశ్రయించింది. అప్పటి ఎస్ఐ రాజేశ్ కేసు నమోదు చేయగా ఏసీపీ హబీబ్‌ఖాన్ దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్ చేశారు. పెద్దపల్లి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో విచారణ జరుగగా ఇరుపక్షాల వాదనలు విన్న జడ్జి సునిత నేరస్తుడు షేక్ అన్వర్‌పై నేరం రుజువు కావడంతో పది సంవత్సరాల కఠిన కారాగార శిక్షతోపాటు రెండు వేల జరిమానా విధించారు. శిక్షపడడంలో పీపీ బాదం రమేష్, పోలీసులు కీలకపాత్ర పోషించారని సీపీ అభినందించారు.

వృద్ధుడి ఆత్మహత్య

జగిత్యాలరూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల రూరల్ మండలం మోరపల్లి గ్రామానికి చెందిన మర్రిపెల్లి చిన్న అంజయ్య (84)అనే వృద్ధుడు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు జగిత్యాల రూరల్ ఎస్సై సధాకర్ తెలిపారు. చిన్న అంజయ్య కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు, మానసిక సమస్యలతో బాధపడుతున్నాడు. దీంతో జీవితంపై విరక్తి చెంది మంగళవారం తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య మర్రిపల్లి దుబ్బరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటలిజెన్స్ డీఎస్పీ గౌస్‌బాబాకు ఏఎస్పీగా పదోన్నతి

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ ఇంటలిజెన్స్ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న గౌస్‌బాబాకు అడిషనల్ ఏఎస్పీగా పదోన్నతి కల్పించారు. కరీంనగర్ ఇంటిలిజెన్స్ ఏఎస్పీ పోస్టు కొంత కాలంగా ఖాళీగా ఉండడంతో గౌస్‌బాబా ఇప్పటి వరకు ఇన్‌చార్జిగా విధులు నిర్వహించారు. ఇప్పుడు గౌస్‌బాబాను కరీంనగర్ అడిషనల్ ఎస్పీగా పూర్తిస్థాయి చార్జిని అప్పగిస్తూ నియామక ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ సందర్భంగా గౌస్‌బాబాను మంగళవారం ఇంటలిజెన్స్ కరీంనగర్ కార్యాలయంలో టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శి సంగెం లక్ష్మన్‌రావు, గూడ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు హర్మిందర్‌సింగ్, రామస్వామి సన్మానించారు.

● జిల్లాకు బదిలీపై వచ్చిన 16 మంది హెడ్‌కానిస్టేబుళ్లు

రాజన్న జోన్-3లో ప్రస్తుతం పని చేస్తున్న హెడ్‌కానిస్టేబుళ్లు 16 మంది కరీంనగర్ పోలీస్ కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు సోమవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. కరీంనగర్ కమిషనరేట్‌లో కానిస్టేబుళ్లుగా పనిచేసి కొంత కాలం కిందట హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొంది ఇతర జిల్లాలకు బదిలీపై వెళ్లారు. కమిషనరేట్‌లో ప్రస్తుతం ఖాళీగా ఉన్న పోస్టులకు వీరిని జిల్లాకు బదిలీ చేశారు.

ఆన్‌లైన్ గేమ్స్ ఆడవద్దని తల్లిదండ్రుల మందలింపు

● ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు ● చికిత్స పొందుతూ మృతి


అజయ్ (ఫైల్)

కమాన్‌పూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండల కేంద్రం శివారు పిల్లిపల్లెకు చెందిన అజయ్(24) ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడ్డాడు. ఆడవద్దని తల్లిదండ్రులు మందలించడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పిల్లి అజయ్ హైదరాబాద్‌లో బీటెక్ చదువుతున్నాడు. సెల్‌ఫోన్‌లో ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతూ లక్షల రూపాయలు నష్టపోయాడు. తల్లిదండ్రులు వద్దని వారిస్తే రెండేళ్ల క్రితం ఇంటినుంచి వెళ్లి పోయాడు. అతన్ని ఇంటికి తీసుకురాగా మళ్లీ ఆన్‌లైన్ గేమ్స్ ఆడుతుండటంతో వద్దని మందలించారు. దీంతో గత నెల 29న గుండారం-రాజాపూర్ శివారులో గడ్డి మందు తాగి స్నేహితులకు ఫోన్‌చేసి చెప్పాడు. అజయ్ కుటుంబ సభ్యులు హుటాహుటిన పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. అజయ్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పండ్ల ఆటో బోల్తా


రోడ్డుపై పడిపోయిన పండ్లు

కోరుట్ల, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల పట్టణంలోని జాతీయ రహదారిపై మంగళవారం అల్‌బుకార్ పండ్లు తరలిస్తున్న ఆటో బోల్తా పడింది. పట్టణంలోని అయిలాపూర్ ఎక్స్‌రోడ్డు నుంచి జాతీయ రహదారిపైకి అతి వేగంగా డ్రైవర్ ఆటోను నడపడంతో అదుపుతప్పి బోల్తా కొట్టింది. పండ్లు కింద పడిపోవడంతో స్థానిక వ్యాపారులు సహాయం చేసి పండ్లను పెట్టెలలో ఎత్తారు. సంఘటనలో ఆటో పూర్తిగా ధ్వంసం కాగా డ్రైవర్‌కు గాయాలయ్యాయి.


రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు పతకాలు


పతకాలు సాధించిన విద్యార్థులు

సిరిసిల్ల టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో జూన్ 28, 29న జరిగిన రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో రాజన్న సిరిసిల్ల జిల్లాకు పతకాలు వచ్చాయి. రాష్ట్ర స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించిన జిల్లా విద్యార్థులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు మంగళవారం సిరిసిల్లలో కిక్ బాక్సింగ్ కోచ్ వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా నుంచి 20 మంది విద్యార్థులు వెళ్లగా కిక్ బాక్సింగ్ పలు విభాగాలలో బంగారు, వెండి, కాంస్య పతకాలను సాధించారు. ఎలగందుల శ్రీనివాస్, గంగనవేణి ప్రవళిక, అన్నాల్‌దాస్ లక్ష్మిప్రసన్న, బోయిన లోకేష్, ఏర్నాల రాజశేఖర్, గజ్జెల శ్వేదిక, కర్నె యతిక, గౌతమ్, ఆనందర్, శివష్, కొండ శ్రీరామ్, గజ్జెల హిరణ్య, షేక్ అజహన్‌లు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు.

తమిళనాడు రాష్ట్రం చెన్నయ్‌లో జరగనున్న జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలలో ఎంపికైన జిల్లా విద్యార్థులు పాల్గొంటారని వారు తెలిపారు.

జీతాలు ఇవ్వండి మహాప్రభో



కరీంనగర్ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంతాల్లో ధూపదీప, నైవేద్య పథకం కింద (డీడీఎన్) పనిచేసే దేవాలయాల అర్చకులకు మార్చి, ఏప్రిల్‌తో పాటు జూన్ మాసాన్ని కలుపుకుంటే మూడు నెలలుగా జీతాలు రాలేదు. దీంతో వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం అర్చకులకు గౌరవ భృతి కింద రూ.6 వేలు, ధూపదీపాలు, హారతి, నైవేద్యానికి రూ.4 వేల చొప్పున మొత్తం 10 వేలు చెల్లిస్తుండగా ఇప్పటివరకు అకౌంట్‌లలో జమ కాలేదు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో 898 ఆలయాల అర్చకులు జీతాల కోసం ఎదురు చూస్తున్నారు. ఉదయం, సాయంత్రం పూజలు, పునస్కారాలతో ఆలయాలనే నమ్ముకొని బతుకుతున్న వారికి నిత్యం పూట గడవడం కష్టంగా ఉంది. చిన్నచిన్న ఆలయాలకు భక్తుల తాకిడి తక్కువగా ఉండడంతో దేవుడి కైంకర్యాలకు అంతరాయం ఏర్పడుతోంది. విశేష రోజులు, ఉత్సవాలు, పండుగలు వస్తే ధూపదీప నైవేద్యాలకు మరింత ఖర్చు చేయాల్సి వస్తుంది. ఒక వేళ దాతలు, గ్రామ పెద్దలు సహాయం చేస్తే తప్ప ధూప దీప నైవేద్యాలు గడిచే పరిస్థితి. గుడినే నమ్ముకున్న అర్చకులు కూలీ చేయలేక, కుటుంబ అవసరాలకోసం అప్పులు కూడా చేస్తున్నట్లు సమాచారం.

నెలల తరబడి వేతనాలు రాకపోవడంతో నిత్యావసర సరుకులతో పాటు పిల్లల పుస్త కాలు, ఫీజులు చెల్లించేందుకు, రోగాలకు మందులు కొనుక్కునేందుకు అవస్థలు పడుతున్నారు. కనీసం శుభ కార్యాలతోనైనా వెళ్లదీద్దామనుకుంటే రెండు నెలలుగా ముహూర్తాలు లేవు. ప్రస్తుతం ఆషాఢమాసం నడుస్తోంది. దీంతో ఈ ఆధారం కూడా లేకుండా పోయింది. ప్రభుత్వాలు మారినా వేతనాల చెల్లింపుల విషయంలో ప్రతీసారి ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఆలస్యానికి కారణమడిగితే అధికారులు బడ్జెట్ రాలేదని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డీడీఎన్ కింద తొలుత ప్రభుత్వం రూ.2500 చెల్లించేది. ఆ తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.6వేలకు, తర్వాత రూ.10వేలకు పెంచింది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 వేలకు పెంచుతామని ఎన్నికలకు ముందు ప్రకటించింది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా ఆ ఊసే లేదు. వేతనాలు పెంచాలని, సకాలంలో అందించాలని అర్చక సంఘాల నాయకులు ప్రభుత్వానికి పలు మార్లు విజ్ఞప్తి చేసినా, వినతి పత్రాలు సమర్పించినా స్పందన లేదు. ఇప్పటికైనా వేతన పెంపుతోపాటు సకాలంలో జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని, తమ కుటుంబాలను ఆదుకోవాలని అర్చకులు కోరుతున్నారు.

పెద్ద ఆలయాల నుంచి కంట్రిబ్యూషన్ రావాలి

గంగు ఉపేంద్రశర్మ, రాష్ట్ర అర్చక, ఉద్యోగ జేఏసీ చైర్మన్



పెద్ద ఆలయాల నుంచి కంట్రిబ్యూషన్ వస్తే చిన్న ఆలయాల అర్చకులకు వేతనాలు చెల్లించాలని నిర్ణయించారు. ఏటా రూ.26 కోట్ల బడ్జెట్ అర్చక వెల్ఫేర్ అసోసియేషన్‌కు రావాలి. వేతనాలు ప్రస్తుతం ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్‌తో ముడి పడి ఉన్నాయి. జిల్లాల అధికారులు ప్రతీ నెలా 20వ తేదీ లోపు బిల్లులు పంపాలి. త్వరలో వేతనాలు వస్తాయి.

అర్చకులకు ఇబ్బంది: నిట్టూరి సతీశ్‌శర్మ, డీడీఎన్ అర్చక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు



వేతనాలు సకాలంలో అందకపోతే అర్చకులకు అనేక ఇబ్బందులు తప్పవు. సంఘం తరపున దేవాదాయశాఖ మంత్రి, అధికారులను కలిశాం. ఫైనాన్స్ కమిషన్ నుంచి ఉత్తర్వులు రాగానే వేతనాలు పడతాయని చెప్పారు. ప్రతీ నెలా వేతనాలు అందేలా నాయకులు, అధికారులతో మాట్లాడుతాం. అర్చకుల అవస్థలపై వివరించే ప్రయత్నం చేస్తాం.

శతాధిక వృద్ధురాలు మృతి


రాజవ్వ (ఫైల్)

చందుర్తి జూలై 1 (ఆంధ్రజ్యోతి): చందుర్తి మండలం బండపల్లి గ్రామంలో గసిగంటి రాజవ్వ(110) అనే శతాధిక వృద్ధురాలు మృతిచెందింది. గ్రామస్థుల కథనం ప్రకారం... రాజవ్వ రెండు రోజుల నుంచి అనారోగ్యానికి గురై సోమవారం రాత్రి మృతిచెందినట్లు తెలిపారు. రాజవ్వకు నలుగురు కుమారులు, నలుగురు కుమార్తెలు, 19 మంది మనవళ్లు, మనవరాళ్లు ఉన్నారు. ఇప్పటి వరకు రాజవ్వ ఆమె పనులు ఆమె చేసుకుంటూ ఉండేదని కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపారు. రాజవ్వ నలుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు మృతిచెందినట్లు పేర్కొన్నారు. ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చిన్న కుమార్తె అంత్యక్రియలు నిర్వహించారు.

యువతి అదృశ్యం

తంగళ్లపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ఇందిరానగర్‌కు చెందిన మోతే రాధిక అనే యువతి సోమవారం అదృశ్యమైంది. ఇందిరనగర్‌కు చెందిన మోతే రేణుక-కనకయ్యల కూతురు రాధిక సోమవారం సాయంత్రం నుంచి కనిపించకుండా పోయిందని తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఉపేంద్ర చారి తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

ధర్మపురి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణానికి చెందిన కటుకం భూమయ్య అనే యువకుడు గత నెల 8న తన సెల్‌ఫోన్ పోగొట్టుకోగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ధర్మపురి పోలీసులు వెంటనే వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేశారు. సెల్‌ఫోన్ ఆచూకీ తెలుసుకుని భూమయ్యకు అప్పగించినట్లు హెడ్‌కానిస్టేబుల్ పులి రవికుమార్ తెలిపారు.

తెరుచుకున్న బాబ్లీ గేట్లు

ఎస్సారెస్పీకి పెరగనున్న వరద



బాబ్లీ గేట్లు ఎత్తడంతో వస్తున్న వరద నీరు

జగిత్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రంలో గోదావరి నదిపై గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకున్నాయి. మంగళవారం బాబ్లీ ప్రాజెక్టు, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారుల సమక్షంలో బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి నీటిని దిగువకు వదిలారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో గోదావరి నదిపై మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీ ప్రాజెక్టు గేట్లను గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం జూలై 1వ తేదీ నుంచి ఎత్తి నీటిని వదిలారు. నాలుగు నెలల పాటు బాబ్లీ ప్రాజెక్టు గేట్లు తెరుచుకొని ఉంచి వచ్చిన నీరును వచ్చినట్లుగానే దిగువలోకి వదలనుండడంతో రానున్న రోజుల్లో ఎస్సారెస్పీలోకి వరద నీరు వచ్చి చేరనుంది. అక్టోబరు 28 వరకు బాబ్లీ గేట్లను ఎత్తి ఉంచనున్నారు. బాబ్లీ గేట్లు తెరుచుకునే పనులను పరిశీలించడానికి ఎస్సారెస్పీ అధికారుల బృందం మహారాష్ట్రలోని బాబ్లీ ప్రాజెక్టును సందర్శించింది. బాబ్లీని సందర్శించిన అధికారుల బృందంలో సీడబ్ల్యూసీ ఈఈ ఎంఎల్ ఫ్రాంక్లిన్, పోచంపాడ్ ఎస్ఈ శ్రీనివాస్ గుప్త, ఈఈ చక్రపాణి, నాందేడ్ బాబ్లీ ఈఈ బాన్సోడ్, పోచంపాడ్ ఏఈఈ కొత్త రవి, పలువురు బాబ్లీ డ్యామ్, శ్రీరాంసాగర్ ప్రాజెక్టు అధికారులు తదితరులున్నారు.

సహకార సంఘాల సేవలను సద్వినియోగం చేసుకోవాలి

చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): సహకార సఘాలను సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సహకార శాఖ అధికారి రామానుజచార్యులు అన్నారు. మంగళవారం చొప్పదండి ప్యాక్స్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ సహకార వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి సహకార సంవత్సరంగా గుర్తించడం శుభపరిణామమని అన్నారు. సహకార సంఘాల అవసరాన్ని విస్తృతంగా రైతులకు చేరవేయాలని, సంఘం ద్వారా రైతులకు కావాల్సిన స్వల్ప కాలిక, దీర్ఘకాలిక రుణాలను, ఎరువులను, పురుగు మందులను సకాలంలో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్యాక్స్ చైర్మన్ వెల్మ మల్లారెడ్డి, క్రిబ్‌కో కంపెనీ జిల్లా మేనేజర్ ప్రేమ్ తేజ్, ఏరియా మేనేజర్ నవీన్ కుమార్, సంఘం ఉపాధ్యక్షులు ముద్దం మహేశ్‌గౌడ్, సీఈవో కళ్లెం తిరుపతిరెడ్డి, డైరెక్టర్లు కళ్లెం లక్ష్మారెడ్డి గుర్రం ఆనందరెడ్డి, మంగళారపు మల్లారెడ్డి, నాంపల్లి మల్లయ్య, మాజీ సహకార అధికారి గుర్రం ఇంద్రసేనారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్

కరీంనగర్ స్పోర్ట్స్/ చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్‌లోని హరిద్వార్‌లో జూన్ 23, 24, 25 తేదీల్లో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్స్ తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారులు పతకాలను సాధించినట్లు ఉమ్మడి జిల్లా తైక్వాండో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మెహర్, సంతోష్ ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు మొత్తం ఏడు స్వర్ణం, ఒక రజత పతకం సాధించినట్లు పేర్కొన్నారు. క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడాశాఖ అధికారి శ్రీనివాస్‌గౌడ్ అభినందించారు. భవిష్యత్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో తైక్వాండో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పెండ్లి రాజేశం, కోచ్ హరి, శ్రీజ, రమ్య, నాగమణి, అంజలి పాల్గొన్నారు.

జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఏఆర్ కానిస్టేబుల్



కరీంనగర్ స్పోర్ట్స్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి మహిళల హ్యాండ్‌బాల్ పోటీలకు ఏఆర్ కానిస్టేబుల్ మాధవి ఎంపికయ్యారని హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేణి లక్ష్మణ్ తెలిపారు. రామగుండం కమిషనరేట్‌లో విధులు నిర్వహిస్తున్న మాధవి రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తున్నట్లు చెప్పారు. గుజరాత్‌లోని భుజ్‌లో ఈ పోటీలు జరుగుతున్నాయన్నారు. ఈ సందర్భంగా మాధవిని సంఘం రాష్ట్ర కార్యదర్శి శ్యామల పవన్ కుమార్, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, ఒలింపిక్ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి అభినందించారు.

రైతుల కోసం పలు యాప్‌లు



- వర్షాలపై ముందస్తు సమాచారం
- ఎప్పటికప్పుడు వాతావరణ వివరాల అందజేత

చొప్పదండి, జూలై 1 (ఆంధ్రజ్యోతి): వర్షాలు ఎప్పుడుపడతాయో, వాతావరణం ఎప్పుడు మారుతుందో రైతులకు తెలియక నష్టపోతున్నారు. వరుణుడి కోసం ఎదురుచూస్తూ పంటల సాగును చేపడుతున్నారు. ముందస్తు వాతావరణ సూచనలు, సలహాలు తెలియక అకాల వర్షాలు, భారీ వర్షాలు కొన్ని సందర్భాల్లో పంటలను దెబ్బతీస్తున్నాయి. పిడుగులు పడి వ్యవసాయ పనులకు వెళ్లిన రైతులు మృత్యువాత పడుతున్నారు. ఈ నేపథ్యంలో రైతులకు సకాలంలో వాతావరణ సూచనలు, వర్షాలు, పిడుగుల సమాచారం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ మంత్రిత్వ శాఖతోపాటు ఎర్త్ సైన్సెస్ మంత్రిత్వ శాఖలు ఐఎండీ, ఐకార్ సహకారంతో పలు యాప్‌లను రూపొందించింది. మేఘదూత్, కిసాన్ సువిధ, రెయిన్ అలారం, దామిని యాప్‌లను రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ యాప్‌ల ద్వారా రైతులకు ఎప్పటికప్పుడు వాతావరణ సమాచారం తెలుసుకోవచ్చు. కొన్ని యాప్‌లు ముందస్తు సమాచారాన్ని కూడా అందిస్తున్నాయి. ఈ నేపథ్యంలో రైతుల కోసం ప్రత్యేక కథనం...

సమాచారం తెలుగులోనూ అందుబాటులో ఉంది..



వంశీకృష్ణ, మండల వ్యవసాయ అధికారి, చొప్పదండి

రైతులు పంటలు సాగు చేసే సమయంలో వాతావరణ సమాచారం ఎంతో అవసరం. వాతావరణ వివరాలను తెలిపే యాప్‌లను సద్వినియోగం చేసుకోవాలి. ఈ యాప్‌లలో సమాచారం తెలుగులోనూ అందుబాటులో ఉంది.

మేఘదూత్‌తో నాలుగు రోజుల ముందే సమాచారం...



మేఘదూత్ యాప్‌లో రానున్న నాలుగు రోజుల వాతావరణ సమాచారాన్ని రైతులు ముందే తెలుసుకోవచ్చు. ఈ యాప్‌లో వారం క్రితం నాటి సమాచారంతోపాటు ప్రస్తుత సమయంలో ఉష్ణోగ్రత, వర్షపాతం, గాలి వేగం సమాచారాన్ని యాప్ ద్వారా పొందవచ్చు. ఇతర ప్రాంతాలకు ప్రయాణం చేసే వారు కూడా ఈ యాప్ ద్వారా ముందస్తు సమాచారాన్ని తెలుసుకోవచ్చు.

వర్ష సూచనకు రెయిన్ అలారం, కిసాన్ సువిధ



వివిధ ప్రాంతాల్లో వర్ష సూచనలను నిరంతరం తెలుసుకునేందుకు రెయిన్ అలారం, కిసాన్ సువిధ యాప్‌ల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంది. ఐదు రోజుల ముందస్తు హెచ్చరికలను ఈ యాప్‌లో అందుబాటులో ఉన్నాయి. వాతావరణంతోపాటు మార్కెట్ ధరలు, పంటల బీమా సమాచారం, విత్తనాలు, ఎరువులు, నీటి నిర్వహణపై పలు సూచనలు ఈ యాప్‌లలో రైతులకు అందుబాటులో ఉన్నాయి. అన్ని భాషలతోపాటు తెలుగులో కూడా ఈ యాప్‌లు అందుబాటులో ఉన్నాయి. ఈ యాప్‌లను రైతులు ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

దామిని ద్వారా పిడుగుల సమాచారం..



ఉరుములు, మెరుపులు, పిడుగులకు సంబంధిం చిన సమాచారాన్ని దామిని యాప్ ద్వారా తెలుసుకోవచ్చు. పిడుగులు ఎక్కడ పడే అవకాశం ఉందో ఈ యాప్ సమాచారం అందిస్తుంది. పిడుగు పడే సమయంలో రైతులు తగు జాగ్రత్తలు తీసుకుని రక్షణ పొందవచ్చు. పిడుగు పడే వాతావరణం ఉన్నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఈ యాప్‌లో అందు బాటులో ఉంటాయి.

అంజన్న సన్నిధిలో భక్తుల సందడి



ఆలయ ఆవరణలో భక్తులు

మల్యాల, జూలై 1 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో మంగళవారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు స్వామి వారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అంజన్నతో పాటు బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. వేకువ జాము నుంచి కురిసిన ముసురు వర్షం భక్తులకు అసౌకర్యం కలిగించింది. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా అధికారులు పర్యవేక్షించారు.

భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా కిశోర్



హుజూరాబాద్, జూలై 1(ఆంధ్రజ్యోతి): హుజూ రాబాద్ పట్టణానికి చెందిన నేర్నాల కిశోర్‌ను తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సలహాదారుల కమిటీ సభ్యుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కిశోర్ నియామకం పట్ల హుజూ రాబాద్ నగారే బృందం చొల్లేటి రాజన్న, పిట్టల శ్రీనివాస్, మురళీ మధు, వడ్లకొండ అనిల్, బాబ్జీ, డప్పు సురేష్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బోడకాకర కిలో రూ.400



(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఎన్నో పోషకాలు, కావాల్సినన్ని విటమిన్లు అందించే బోడకాకర ధర కూడా భయపెడుతోంది. మంగళవారం సిరిసిల్ల మార్కెట్‌లో కిలో రూ.400 ధర పలికింది. వర్షాకాలంలో మాత్రమే కనిపించే బోడకాకర చాలా తక్కువగా మార్కెట్‌లోకి వస్తుంటుంది. దీంతో ఎక్కువ ధర అయినా ప్రజలు కొనడానికి ముందుకు వస్తారు. గతేడాది ఇదే సీజన్‌లో రూ.200 కిలో ఉన్న బోడకాకర ఈ ఏడాది రూ 400లకు చేరడంతో కొనాలని ఉన్నా ధరలు భయపెడుతున్నాయి.

ఔషధ గుణాలు ఎన్నో..

బొంతకాకర, అడవికాకర, అగాకార పేర్లతో పిలిచే బోడకాకరలో ఎన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇందులో బీ1, బీ2, బీ3, బీ5, బీ6, బీ9, బీ 12 విటమిన్‌లతో పాటు ఏ, సీ, డీ2, డీ3, కాల్షియం, మెగ్నీషియం, పోటాషియం, సోడియం, విటమిన్ హెచ్, కే, కార్బొహైడ్రేట్లు, ఫైబర్, కాపర్, జింక్ ప్రొటీన్‌లు ఉన్నాయి.

బోడకాకర తలనొప్పి, జుట్టు రాలడం, చెవినొప్పి, దగ్గు, కడుపులో ఇన్‌ఫెక్షన్లు రాకుండా చూస్తుంది. డయాబెటిక్ రోగులకు ఎంతో ఉపయోగ కరంగా ఉంటుంది. వర్షాకాలంలో వచ్చే ఎలర్జీని కూడా దూరం చేస్తుంది. పక్షవాతం, కంటి సమస్యలు, రక్తపోటు, క్యాన్సర్, కిడ్నీలో రాళ్లు రాకుండా కూడా దోహదపడుతుంది. గర్భిణులు బోడకాకర తింటే శిశువు ఎదుగుదలకు కూడా ఉపయోగపడుతుందని వైద్యులు చెబుతున్నారు.

ఆశ్రమ పాఠశాలకు ఆదరణ కరువు

అన్ని వసతులున్నా పిల్లలను చేర్పించని తల్లి దండ్రులు



చిత్రవేణిగూడెం బాలుర ఆశ్రమ పాఠశాల

బీర్‌పూర్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిత్రవేణి గూడెం బాలుర ఆశ్రమ పాఠశాలకు ఆదరణ కరువైంది. ఈ పాఠశాలలో మూడో తరగతి నుంచి ఎనిమిదో తరగతి వరకు చదువుకునే విద్యార్థులు 40 మంది ఉన్నారు. ప్రధానోపాధ్యాయుడు, ముగ్గురు సీఆర్‌టీలు, ముగ్గురు వాలంటీర్లు ఉన్నారు. ఈ పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. అయినా మండలంలోని గిరిజన విద్యార్థులు పాఠశాలలో చేరడం లేదు. మండలంలో రంగాసాగర్, చెర్లపల్లి, కండ్లపల్లి, మంగేళ, తాళ్లధర్మారం, చిత్రవేణిగూడెం, చిన్న కొల్వాయి, తుంగూర్, కోమన్‌పల్లి, కందెనకుంట, బీర్‌పూర్, సారంగాపూర్ మండలంలో బట్టపల్లి-పోతారం, సారంగా పూర్, రేచపల్లి, లక్ష్మీదేవిపల్లి, అర్పపల్లి గ్రామాల్లో గిరిజన విద్యార్థులు ఉన్నారు. అధికారులు ఆశ్రమ పాఠశాల గురించి అవగాహన కల్పించకపోవడంతో విద్యార్థులు చేరడం లేదు. సమీపంలో అన్ని వసతులతో కూడిన ఆశ్రమ పాఠశాలలు ఉండగా దూర ప్రాంతాలకు వెళ్లి చదువుకుంటున్నారు.

అడ్మిషన్ల కోసం ఉపాధ్యాయుల తిప్పలు

స్థానిక విద్యార్థులు చేరకపోవడంతో ఆశ్రమ పాఠశాల సిబ్బంది పొరుగు జిల్లాలైన ఆదిలాబాద్, మంచిర్యాల ప్రాంతాల కు చెందిన విద్యార్థులను చేర్చుకుంటున్నారు. అధికారులు స్పందించి మండలంలోని మంగేళ గ్రామంలో ఉన్న బాలికల గిరిజన పాఠశాలపై, చిత్రవేణి గూడెంలో ఉన్న బాలుర ఆశ్రమ పాఠశాలపై గిరిజనుకు అవగాహన కల్పించి విద్యార్థులను చేర్పించేందుకు కృషి చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

విద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను చేర్పించాలి



శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు

ఆశ్రమ పాఠశాలను తల్లిదండ్రులు ఒక్క సారి సందర్శించి పాఠశాలలో వసతులు, ఆహారాన్ని, పరిసర ప్రాంతాలను పరిశీలించాలి. అన్ని సౌకర్యాలు ఉన్నాయి. విద్యార్థులకు మంచి విద్యను అందిస్తున్నాం. తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమ పాఠశాలలో చేర్పించాలి.

నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలి

జ్యోతినగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఎన్టీపీసీ అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని రామగుండం ఎన్టీపీసీ ఈడీ చందన్ కుమార్ సామంత అన్నారు. మంగళవారం ఈడీసీ మిలీనియం హాల్‌లో అధికారులకు మొదటిసారి కృత్రిమ మేథస్సుపై వర్క్‌షాప్ నిర్వ హించారు. వర్క్‌షాప్‌ను ప్రారంభించిన అనంతరం ఈడీ ప్రసంగిస్తూ సిబ్బంది ఎప్పటికప్పుడు తమను తాము అప్‌గ్రేడ్ చేసుకోవాల్సిన అ వసరం ఉందన్నారు. ఏఐ సాంకేతిక పరిజ్ఞానం తమ రోజువారి వృత్తిలో ఎంతో ఉపక రిస్తుందని తెలిపారు. సోషల్ మీడియా కన్సల్టెంట్, డిజిట్ మార్కెటింగ్ ప్రొఫెసర్ కిరుబా శంకర్ కృత్రిమ మేథస్సు ప్రాధాన్యం, ఆచరణ, ప్రయోజనాలు



ఏఐ వర్క్‌షాప్‌లో పాల్గొన్న ఎన్టీపీసీ అధికారులు

తదితర అంశాలపై అధికారులకు అవగాహన కల్పించారు. ఏఐతో కమ్యూనికేషన్ రంగంలో వచ్చే విప్లవాత్మక మార్పులపై వివరించారు. వర్క్‌షాప్‌లో జీఎం మనోజ్ ఝా, ఏజీఎం హెచ్‌ఆర్ విజయ్‌కుమార్ సిక్దర్, అధికారులు, కమ్యూనికేషన్ అధికారులు(పీఆర్), సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీపీసీ జీఎంకు సీజీఎంగా పదోన్నతి

ఎన్టీపీసీ ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ జీఎం అలోక్‌కుమార్ త్రిపాఠికి పదోన్నతి లభించింది. త్రిపాఠికి చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం)గా ప్రమోషన్ కల్పిస్తూ మంగళవారం కార్పొరేట్ సెంటర్ ఉత్తర్వులు జారీ చేసింది. పదోన్నతి లభించినప్పటికీ ఆయన ఇక్కడి ప్రాజెక్టులోనే పని చేయనున్నారు.

ప్రమాదకరంగా లో లెవెల్ వంతెనలు



అర్కండ్ల లో లెవెల్ బ్రిడ్జిపై ఉధృతంగా ప్రవహిస్తున్న నీరు (ఫైల్)



అర్కండ్లలోని లెవెల్ బ్రిడ్జి

శంకరపట్నం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ఏళ్లు గడుస్తున్నాయి.. ప్రభుత్వాలు మారుతున్నాయి.. సమస్యలపై ప్రజలు, ప్రభుత్వ యంత్రాంగానికి విన్నవిస్తున్నారు. కానీ సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. వర్షాకాలంలో వాగులు ఉప్పొంగిలో లెవల్ బ్రిడ్జిల పైనుంచి నీరు ప్రవహించడంతో వాగు దాటాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వాగు ఉప్పొంగినపుడు తరచుగా ప్రమాదాలు జరుగుతున్నాయి. వాగులపై బ్రిడ్జిలు నిర్మించాలని ప్రజలు ఏళ్లుగా కోరుతున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు.

అర్కండ్ల బ్రిడ్జిపై అవస్థలు

శంకరపట్నం మండలం అర్కండ్ల-కన్నాపూర్ గ్రామాల మధ్య అర్కండ్ల వాగుపై ఉన్న లో లెవెల్ బ్రిడ్జి వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు ప్రమాదకరంగా మారుతుంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై నుంచి నెలల తరబడి నీరు ప్రవహిస్తూ ఉంటుంది. అర్కండ్ల గ్రామ ప్రజలు వ్యవసాయ పనుల నిమిత్తం ప్రతిరోజు బ్రిడ్జి దాటి రావాల్సి ఉంటుంది. భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జిపై నీరు ఉధృతంగా ప్రవహించడంతో గ్రామస్థులు కొన్ని రోజుల పాటు పొలాల వద్దకు రావడానికి అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అంతేకాక వీణవంక మండలం చల్లూరు నుంచి శంకరపట్నం మండలం కేశవపట్నం ఎన్‌హెచ్-563 రహదారి వరకు 13 కిలో మీటర్ల మేర రూ. 17 కోట్లతో బ్రిడ్జి మీద గుండా బీటీ రోడ్డు నిర్మించారు.

వీణవంక మండలంలోని పలు గ్రామాలు ఈ దారి మీదుగా కేశవపట్నం చేరుకోవడానికి అనువుగా ఉంటుంది. వర్షాకాలం వస్తే అర్కండ్లలో లెవెల్ బ్రిడ్జిపై నుంచి నీరు ప్రవహించడంతో భారీ వాహనాలు తప్ప చిన్న వాహనాల రాకపోకలకు నెలల తరబడి అంతరాయం ఏర్పడుతుంది. వర్షాకాలంలో బ్రిడ్జిపై నాచు పట్టి జారే స్వభావం కలిగి ఉండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడిన ఘటనలున్నాయి. చల్లూరు నుంచి కేశవపట్నం జాతీయ రహదారి వరకు రూ. 17 కోట్లతో రోడ్డు నిర్మించారు. కానీ అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మించకపోవడంతో వర్షాకాలంలో రాకపోకలకు అంతరాయం కలుగుతుందని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే చొరవ తీసుకొని అర్కండ్ల వాగుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పాపయ్యపల్లె నుంచి కేశవపట్నం వెళ్లే లో లెవెల్ బ్రిడ్జి (ఫైల్)

పాపయ్యపల్లె లో లెవెల్ బ్రిడ్జి

కేశవపట్నం గ్రామపంచాయతీ పరిధిలోని పాపయ్యపల్లె గ్రామానికి వెళ్లే దారిలో వాగుపై లో లెవెల్ బ్రిడ్జి నిర్మించారు. వర్షాకాలంలో భారీ వర్షాలు కురిసినప్పుడు బ్రిడ్జీపై నుంచి నీరు ప్రవహించడంతో మండల కేంద్రంతో పాటు కేశవపట్నం గ్రామ పంచాయతీకి రాకపోకలు నిలిచిపోతాయి. అంతేకాక గ్రామపంచాయతీకి రెండు కిలో మీటర్ల దూరంలో ఉన్న పాపయ్యపల్లెకు సరైన రోడ్డు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పాపయ్యపల్లె గ్రామానికి బ్రిడ్జితో పాటు బీటీ రోడ్డు వేసి సమస్యలు తీర్చాలని గ్రామస్థులు కోరుతున్నారు.

వరండాలోనే చదువులు.. పట్టించుకోని అధికారులు..

వీర్నపల్లి, జూలై 1 (ఆంధ్రజ్యోతి) : వీర్నపల్లి మండలం బావ్‌సింగ్ నాయక్ తండా ప్రాథమిక పాఠశాలలో 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు 27మంది విద్యార్థులు చదువుతున్నారు. పాఠశాలలో బోధించేందుకు ఒకే ఒక్క టీచర్ ఉండటంతో పాఠశాల గదిలో రెండు తరగతులు, గది బయట వరండాలో మూడు తరగతులకు ఒకే చోట బోధిస్తున్నారు. వరండాలో కూర్చొని చదువుతుండటంతో ముసురు వానకు విద్యార్థులు వణుకుతున్నారు. కనీసం కూర్చునేందుకు బెంచీలు కూడా కరువయ్యాయి. 11 మంది కంటే ఎక్కువ విద్యార్థులు పాఠశాలలో చదివితే ఇద్దరు ఉపాధ్యాయులు అవసరం ఉంటుంది. గతంలో విద్యార్థులకు సరిపడా టీచర్‌ను డిప్యూటేషన్‌పై కేటాయించడంతో ఇద్దరు ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించారు. ఈ సంవత్సరం డిప్యూటేషన్ రద్దవడంతో ఖాళీ ఏర్పడింది. ఒకే టీచర్ విద్యనందించడంతో కొంత మంది విద్యార్థుల తల్లిదండ్రులు ప్రైవేటు పాఠశాలలకు పిల్లలను పంపిస్తున్నారు. ఉన్నతాధికారులు ప్రభుత్వ పాఠశాలల్లో సరిపడా ఉపాధ్యాయులను కేటాయించి కనీస సదుపాయాలు కల్పించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



వరండాలో నేలపై కూర్చున్న విద్యార్థులు

● సంక్షిప్తంగా..

గణేశ్‌నగర్: రాజీవ్ యువ వికాస్ పథకాన్ని వెంటనే ప్రారంభించి అర్హులకు రుణాలు ఇవ్వాలని డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో కరీంనగర్ అర్బన్ తహసీల్దార్ నరేందర్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్‌నగర్: ఐక్య విద్యార్థి సంఘాల నేతల అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నామని శాతవాహన యూనివర్సిటీ బీఆర్ఎస్వీ ఇన్‌చార్జి చుక్క శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఉన్నత విద్యా మండలి ఎదుట ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని ధర్నాకు పిలుపునిచ్చిన ఐక్య విద్యార్థి సంఘాల నాయకులను అర్ధరాత్రి నుంచి అరెస్టు చేసి ఓయూ పోలీస్ స్టేషన్‌కి తరలించారన్నారు.

సైదాపూర్: కార్మికుల హక్కులను కాపాడేందుకు ఈ నెల 9న దేశవ్యాప్తంగా చేపట్టే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గీట్ల ముకుందరెడ్డి, ఎడ్ల రమేష్ పిలుపునిచ్చారు. మంగళవారం వారు సైదాపూర్ మండల కేంద్రంతో పాటు రాయికల్, బొమ్మకల్, ఘన్ పూర్, అమ్మనగుర్తి గ్రామాలలో భవన నిర్మాణ కార్మికుల విస్తృతస్థాయి సమావేశాలకు హాజరై సమ్మె కరపత్రాలు ఆవిష్కరించారు.

జమ్మికుంట రూరల్: ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలని మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఆయాజ్ అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఆర్పీలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. మెప్మా ఎడిఎంసి మల్లీశ్వరి, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహేష్, సిఎల్ ఆర్పీలు పాల్గొన్నారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని ఎల్ఐసీ కార్యాలయంలో ఆలిండియా ఇన్సూరెన్స్ ఎంప్లాయిస్ అసోసియేషన్ 75వ వార్షికోత్సవం మంగళవారం నిర్వహించారు. ఐసీఈయూ అధ్యక్షుడు కుమారస్వామి జెండాను ఆవిష్కరించారు.

చొప్పదండి: మండలంలోని ఆర్నకొండలో కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఖాతదారులకు అవగాహన సదస్సును నిర్వహించారు. బ్యాంకు అందిస్తున్న సేవలు, కేంద్ర ప్రభుత్వం పథకాలపై అవగాహన కల్పించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ అంజనేయులు, బ్యాంకు మేనేజర్ మనోజ్‌కుమార్, శ్రీకాంత్, అనిల్, చీకట్ల కుమారస్వామి, ఆనంద్‌కుమార్, ప్రజలు పాల్గొన్నారు.

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్, రంగాపూర్ గ్రామాల్లో ఇటీవల రెవెన్యూ అధికారులు భూభారతి గ్రామ సభలను నిర్వహించి భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ఈ మేరకు మంగళవారం ఆర్ఐ శేఖర్ రాంపూర్, రంగాపూర్ గ్రామాల్లో భూభారతి సమస్యలను పరిశీలించారు. అర్జీదారుల నుంచి వివరాలు నమోదు చేసుకున్నారు.

చొప్పదండి: చొప్పదండి పట్టణానికి చెందిన కల్లెపల్లి విజయ్ అనారోగ్యంతో బాధపడుతుండగా అతని స్నేహితులు చికిత్స కోసం 43 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సాంబారి శ్రీనివాస్, పచ్చునూరి తిరుపతి, ముద్దం నరేందర్, శివ, కనకరాజు, సుధాకర్ పాల్గొన్నారు.

గంగాధర: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న నేషనల్ లైవ్ స్టాక్ మిషన్‌ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జేడీ సుధాకర్ అన్నారు. మంగళవారం గంగాధర మండలం గోపాల్‌రావుపల్లి, గంగాధరలో ఈ పథకంలో లబ్ధిపొందుతున్న వారిని పరిశీలించారు.

గన్నేరువరం: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులు నిర్వహించిన పాలోజు నరసింహాచారి సోమవారం పదవీ విరమణ పొందారు. తహసీల్దారు జక్కని నరేందర్ ఆధ్వర్యంలో సన్మానించారు.

ఇల్లందకుంట: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరని ఆలయ ఈవో సుధాకర్ అన్నారు. ఇల్లంద కుంట మండల కేంద్రంలోని సీతా రామచంద్ర స్వామి ఆలయంలో పాచక వృత్తిలో కొనసాగుతున్న వానమామలై లోకాచార్యులు పదవీవిరమణ నిర్వహించారు.

మానకొండూర్: ఇందిరమ్మ ఇల్లు తన భార్య పేరున మంజూరైతే తనను బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎలా సస్పెండ్ చేస్తారని బీఆర్ఎస్ బహిష్కృత గ్రామ శాఖ అధ్యక్షుడు బొల్లం శ్రీనివాస్‌గౌడ్ ప్రశ్నించారు. మానకొండూర్‌లో ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ 2006 నుంచి బీఆర్ఎస్‌లో కార్యకర్తగా చేరి గ్రామ అధ్యక్షుడిగా పార్టీకి సేవలు అందించానన్నారు.



వైద్యులు, చార్టెడ్ అకౌంటెంట్స్‌ను సన్మానిస్తున్న అల్ఫోర్స్ అధినేత నరేందర్‌రెడ్డి



డాక్టర్ కృష్ణప్రసాద్‌ను సన్మానిస్తున్న అసోసియేషన్ బాధ్యులు

ఘనంగా డాక్టర్స్ డే

● వైద్యులకు సన్మానం

సుభాష్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో డాక్టర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులను సన్మానించారు. జిల్లా కేంద్రంలోని అపోలో రీచ్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ అధికారి డాక్టర్ నాగసతీష్ మాట్లాడుతూ సమాజంలో వైద్య వృత్తి ఎంతో ముఖ్యమైనదన్నారు.

● నగరంలోని రావూస్ స్కూలు విద్యార్థులు అపోలో రీచ్ ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆరోగ్యాన్ని కాపాడుకునే విషయాలను వైద్యులు సూచించారు. పాఠశాల చైర్మన్ ప్రభాకర్‌రావు, సీఈవో నితిన్‌రావు, ప్రిన్సిపాల్ రెహ్మాన్ పాల్గొన్నారు.

భగత్‌నగర్: నగరంలోని పద్మానగర్ పారమిత హెరిటేజ్, మంకమ్మతోటలోని పారమిత ఉన్నత పాఠశాలలో చైర్మన్ డాక్టర్ ప్రసాదరావు మాట్లాడుతూ వైద్యులు దేవుడితో సమానమన్నారు. ప్రముఖ్య నేత్ర వైద్య నిపుణురాలు శ్రీలత విద్యార్థు లకు హెల్త్ క్యాంపు నిర్వహించారు. అనంతరం వైద్యులను సన్మానించారు. డైరెక్టర్లు అనూకర్‌రావు, రశ్మిత, ప్రసూన, రమణ, వీయూం ప్రసాద్, వినోద్‌రావు, హన్మంతరావు, ప్రధానోపాధ్యాయులు గోపికృష్ణ, బాలాజి, ప్రశాంత్, కవితాప్రసాద్ పాల్గొన్నారు.

రేకుర్తి కంటి ఆస్పత్రిలో మంగళవారం డాక్టర్స్ డే, చార్టర్ అకౌంటెంట్స్ డే నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ, ఆస్పత్రి చైర్మన్ కొండ వేణుమూర్తి, ప్రకాశ్‌హొల్లా, బద్రుద్దీన్ కిమాని, శరత్‌కృష్ణ, శివకాంత్, ఏలుగురి ప్రసాద్, రాజేంద్ర ప్రసాద్, వైద్యులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలోని మేడికేర్ ఆస్పత్రి ఫార్చ్యూన్ అధినేత ముప్పిడి రాజశేఖర్‌రెడ్డి, ఉషావాణి సహకారంతో ఆస్పత్రికి చెందిన పది మంది వైద్యులను సన్మానించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి, కార్యదర్శి కిషన్‌రెడ్డి, ఫస్ట్‌వైస్ ప్రెసిడెంట్ చాడ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్ టౌన్: భగత్‌నగర్‌లోని అల్ఫోర్స్ ఇటెక్నో పాఠశాలలో అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి నరేందర్ రెడ్డి మాట్లాడుతూ వైద్యుల సేవలు ఎనలేనివని కొనియాడారు. పాఠశాలలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు.

డీసీహెచ్ఎస్‌ను సన్మానించిన వైద్యులు

సుభాష్‌నగర్: అసోసియేషన్ ఫిజీషియన్స్ ఆఫ్ ఇండియా కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ కృష్ణప్రసాద్‌ను సన్మానించారు. వైద్యులు రఘురామన్, విజయ్ మోహన్‌రెడ్డి, డీసీ తిరుపతిరావు, వెంకటేశ్వర్లు, నవీన, చైతన్య, సునీల్‌రాజ్, అనీష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చొప్పదండి: చొప్పదండిలోని సిద్ధార్థ స్కూల్ విద్యార్థులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్యురాలు శ్రీకీర్తనను సన్మానించారు. జడ్పీ క్రీడా మైదానంలో వాకర్స్‌కు వైద్య పరీక్షలు నిర్వహించారు.

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని డాక్టర్ సుజాత ఆస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు.

అల్ఫోర్స్‌లో డాక్టర్స్, చార్టెడ్ అకౌంటెంట్స్ డే

సుభాష్‌నగర్: కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో డాక్టర్స్ డే, చార్టెడ్ అకౌంటెంట్స్ డేను నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యాసంస్థల అధినేత డాక్టర్ నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలను లెక్కచేయకుండా డాక్టర్లు వైద్య సేవలు అందించారన్నారు. అదేవిధంగా ప్రపంచ ఆర్థికరంగానికి మూల స్తంభాలుగా నిలిచేటువంటి చార్టెడ్ అకౌంటెంట్స్ పాత్ర అమూల్యమైనదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌లు తదితరులు పాల్గొన్నారు.



వైద్యులను సన్మానించిన పారమిత పాఠశాల యాజమాన్యం

కొవిడ్ సమయంలో వైద్యుల సేవలు ప్రశంసనీయం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, డాక్టర్ బంగారి స్వామి, డాక్టర్ బంగారి రజనీప్రియదర్శిని

సుభాష్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కొవిడ్ సమయంలో వైద్యుల సేవలు ప్రశంసనీయమని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని రెనే ఆస్పత్రిలో జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ వంటి నగరాలకు దీటుగా కరీంనగర్ రెనే ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యసేవలు అందిస్తున్నారన్నారు. డాక్టర్ బంగారిస్వామి, డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని ఎంతో మందికి వైద్య సేవలు అందించి ప్రాణాలు కాపాడారన్నారు. డాక్టర్ బంగారి స్వామి మాట్లాడుతూ రానున్న రోజుల్లో రెనే ఆస్పత్రిలో పేషంట్లకు అవసరమైన అత్యాధునిక సదుపాయాలు కల్పించడంలో ముందుంటామన్నారు. డాక్టర్ బంగారి రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ డాక్టర్లు వైద్యసేవలు అందించడంతోపాటు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. డీన్ డాక్టర్ మునిష్, మెడికల్ సూపరింటెండెంట్ వైద్యులు రవీంద్రాచారి, రవికుమార్, నిఖిల్‌లక్ష్మణ్, కృష్ణరెడ్డి, సంతోష్, సునీల్‌రెడ్డి, ఫర్హానాజ్, నాన్ క్లినికల్ డైరెక్టర్ అరవింద్‌రావు, జనరల్ మేనేజర్ పవన్‌ప్రసాద్ పాల్గొన్నారు.

స్టైపెండ్ చెల్లించాలని మెడికోల ధర్నా



ధర్నా చేస్తున్న మెడికోలు

కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్టైపెండ్ చెల్లించాలని కరీంనగర్ శివారు బొమ్మకల్‌లోని చల్మెడ ఆనందరావు వైద్య కళాశాలలో మెడికో విద్యార్థులు మంగళవారం కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతీ హౌస్ సర్జన్‌కు నెలకు రూ.25వేలు చెల్లిస్తుందని, యాజమాన్యం జూనియర్ డాక్టర్లకు స్టైపెండ్ అందించడం లేదని అన్నారు. ఆస్పత్రి హౌస్ సర్జన్‌లు, పీజీ ఇంటర్న్‌లు ఎక్కువ పని చేస్తారని, నిబంధనల ప్రకారం తప్పనిసరిగా ఇవ్వాలని అన్నారు.

గురుకుల పాఠశాలను పరిశీలించిన వైద్యాధికారులు

జమ్మికుంట, జూలై 1 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంట పట్టణంలోని హుజూరాబాద్ రోడ్డులోసాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను జిల్లా మలేరియా అధికారి శ్రీరెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాటర్ ప్లాంట్‌లో వాటర్ లీకేజీ కాకుండా చూసుకోవాలని, ఈగలు, దోమలు రాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. వంట గదిని ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచుకోవాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. చేతుల శుభ్రత, వ్యక్తిగత శుభ్రత, పరిసరాలను పరిశుభ్రత పాటించాలన్నారు. అదే విధంగా దగ్గు, జలుబుతో బాధపడుతున్న విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. జ్వరంతో ఉన్న నలుగురు విద్యార్థుల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ చందు, డాక్టర్ రాజేష్, డాక్టర్ మహోన్నత పటేల్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ శ్యాం నాయక్, ప్రిన్సిపాల్ లచ్చయ్య, ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరీంనగర్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం



కమిషనర్‌ను సన్మానిస్తున్న వెలిచాల రాజేందర్‌రావు

కరీంనగర్ అర్బన్, జూలై 1(ఆంధ్రజ్యోతి): కరీంనగర్ నగరాన్ని రాష్ట్రంలోనే ఒక మోడల్ నగరంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు సహకారంతో ముందుకెళ్తామని కాంగ్రెస్ కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు అన్నారు. మంగళవారం మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్‌దేశాయ్‌ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్‌ను సన్మానించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ డంపింగ్‌యార్డు సమస్యను ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

సీపీకి సన్మానం

కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు మంగళవారం పోలీస్ కమిషనర్ గౌస్ ఆలాంను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీపీ సన్మానించారు.

ఎమ్మెల్యే కవ్వంపల్లికి సన్మానం



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సత్యప్రసన్నవెంకటరాంరెడ్డి

డాక్టర్స్ డే సందర్భంగా మానకొండూర్ శాసన సభ్యుడు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణను జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కర్ర సత్య ప్రసన్నవెంకటరాంరెడ్డి మంగళవారం డీసీసీ కార్యాలయంలో సన్మానించారు. జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకులు కవిత, రజిత, హసీనా, పద్మ, ఈశ్వరి, పద్మ పాల్గొన్నారు.

టీపీసీసీ ఎస్సీసెల్ సీనియర్ వైస్ చైర్మన్ వెన్న రాజమల్లయ్య మంగళవారం డీసీసీ కార్యాలయంలో మంగళవారం సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు దిండిగాల మధు, నేహల్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ కాలనీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను ములుగు జిల్లా క్రైమ్ బ్రాంచ్(డీసీఆర్బీ) డీఎస్పీ ఏచర్ల కిషోర్ కుమార్ మంగళవారం సాయంత్రం మర్యాదపూర్వకంగా కలిశారు. డాక్టర్స్ డే సందర్భంగా ఎమ్మెల్యేను సన్మానించారు. కాంగ్రెస్ నాయకులు అనిల్‌కుమార్, మల్లారెడ్డి, రమణారెడ్డి తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

సత్యనారాయణరెడ్డి కృషి అభినందనీయం

కరీంనగర్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రధానోపాధ్యాడు నరహరి సత్యనారాయణ రెడ్డి కృషి అభినందనీయమని డీఈవో మొండయ్య అన్నారు. నగరంలోని శ్రీనగర్‌కాలనీ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాడు నరహరి సత్యనారాయణ రెడ్డి ఉద్యోగ విరమణ అభినందన సభలో మాట్లాడారు. స్వచ్ఛంద సంస్థల ద్వారా పాఠశాలకు, విద్యార్థులకు అవసరమైన వస్తువులను ఇప్పించడంలో కృషి చేశారన్నారు. ఎంఈవో, డిప్యూటీ ఐవోటీస్ భద్రయ్య, సెక్టోరల్ ఆఫీసర్ అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవినీతిపై విచారణ చేపట్టాలి

కరీంనగర్ క్రైం, జూలై 1(ఆంధ్రజ్యోతి):కరీంనగర్ నగర పరిధిలో కిరాని బొమ్మకల్ జంక్షన్ అభివృద్ధి పనుల్లో అవినీతి, అవకతవకలపై విచారణ చేపట్టాలని, బాధ్యులను అరెస్టు చేయాలని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ కోరారు. మంగళవారం పోలీస్‌కమిషనర్ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులోపేర్కొన్న అంశాలను ప్రకటన ద్వారా వెల్లడించారు. కరీంనగర్ స్మార్ట్ సిటీ కమిషనర్, మున్సిపల్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్, సూపరింటెండింగ్ ఇంజనీర్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెన్సీ ప్రతినిధి, దాని మేనేజింగ్ డైరెక్టర్ కేఎస్‌సీసీఎల్ అవకతవకలకు పాల్పడినట్లు ఆరోపించారు.

పుణ్య క్షేత్రాలకు హుజూరాబాద్ నుంచి ప్రత్యేక బస్సులు

హుజూరాబాద్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ పరిసర ప్రాంతాల ప్రయాణికుల కోసం హుజూరాబాద్ డిపో నుంచి పుణ్య క్షేత్రాలకు ఆర్టీసీ అధికారులు ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. అరుణాచలం, యాదగిరి గుట్ట, మేడారం పుణ్యక్షేత్రాల పేరిట టూర్ ప్యాకేజీలను ఆర్టీసీ ప్రకటించింది. పెద్ద సంఖ్యలో ప్రయాణికులు ఉంట ఇళ్ల వద్దకే బస్సులను పంపిస్తున్నారు.

● **ప్రత్యేక ప్యాకేజీలు**

ఆర్టీసీ సంస్థ ప్రయాణికులను ఆకర్షించడానికి ప్రత్యేక ప్యాకేజీలను రూపొందించింది. అరుణాచలానికి ఒక్కొక్క రికి పెద్దలకు రూ. 4500, పిల్లలకు రూ. 3800 తీసుకొని గోల్డెన్ టెంపుల్, కాణిపాకం, అరుణాచలం, జోగుళాంబ మీదుగా నాలుగు రోజుల తర్వాత హుజూరాబాద్‌కు చేరుకుంటుంది. అలాగే యాదగిరి గుట్ట, భద్రకాళి, స్వర్ణగిరి ఆలయాలకు ఒక్కొక్కరికి పెద్దలకు రూ.700, పిల్లలకు రూ.500, మల్లూరు, మేడారం, రామప్ప, లక్నవరం ఒక్కొక్కరికి పెద్దలకు రూ.800, పిల్లలకు రూ.500 ప్యాకేజీ ప్రకటించారు. అడ్వాన్స్ బుకింగ్‌ల కోసం ఫోన్: 9959225924, 9704833971, 9247159535, 9177324963 నంబర్లకు సంప్రదించాలని హుజూరాబాద్ డిపో మేనేజర్ రవీంద్రనాథ్ తెలిపారు.

జిల్లాతో పట్టభిరామ్‌కు అనుబంధం



డాక్టర్ బీవీ పట్టాభిరామ్

కరీంనగర్ కల్చరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు, సైక్రియాటిస్ట్, హిప్నాటిస్ట్, మెజీషియన్ డాక్టర్ బీవీ పట్టాభిరామ్ (75) మంగళవారం హైదరాబాద్‌లో అనారోగ్యంతో మృతి చెందారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో ఆయనకు విడదీయరాని అనుబంధం ఉంది. కరీంనగర్ కలెక్టరేట్‌లో జరిగిన సెమినార్‌కు, జిల్లా ఎల్ఐసీ ఏజెంట్ల వికాస కార్యక్రమానికి, పాజిటివ్ థింకర్స్ క్లబ్ ప్రారంభోత్సవానికి, మేజిక్ ఫెస్టివల్‌కు హాజరయ్యారు. ఉమ్మడి జిల్లాలో పలు పాఠశాలలు, కళాశాలలు నిర్వహించిన కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఏడెనిమిది పర్యాయాలకుపైగా ఇక్కడికి వచ్చినట్లు పలువురు పేర్కొన్నారు. ఆయన మృతిపై పాజిటివ్ థింకర్స్ క్లబ్ బాధ్యులు కేఎస్ అనంతాచార్య, మాడిశెట్టి గోపాల్, జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు మల్లేశం, కాస యతిరాజ్, సభ్యులు మేజిక్ రాజా, నరేన్, హరి, బండి శంకర్, గుర్రం శ్రీనివాస్, చారి, జితేందర్, దీకొండ సత్యం, అలాడీన్, బాలే ఆనంద్, నాంపల్లి మల్లేశం, వంశి, జక్కని రాజు, కరీం, బాబు, వివేకానంద, తేజ, శ్రీజ, కాంతారావు, రాష్ట్ర సాంస్కృతిక సంస్థల, కళాకారుల సమాఖ్య వ్యవస్థాపక అధ్యక్షుడు వైఎస్ శర్మ సంతాపాన్ని తెలిపారు.

చిరు ధాన్యాలను సాగు చేయాలి

కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): చిరుధాన్యాలను సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని జిల్లా వ్యవసాయాధికారి భాగ్యలక్ష్మి అన్నారు. మంగళవారం దుర్శేడ్ రైతు వేదికలో రైతు నేస్తం వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్‌లో చిరుధాన్యాలకు డిమాండ్ ఉండడంతో రైతులకు ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో పైడితల్లి, దుర్శేడ్ సింగిల్‌విండో మాజీ చైర్మన్ వేణుమాధవరావు, డైరెక్టర్ గాండ్ల అంజయ్య, హరీష్‌గౌడ్, మల్లయ్య, మొగ్దుంపూర్‌లో ఏవో సత్యం, ఏఈవో స్వర్ణలత, అంజిరెడ్డి, చామనపల్లి రైతు వేదికలో ఏఈవో సుచరిత పాల్గొన్నారు.

చార్టెడ్ అకౌంటెంట్స్ రక్తదానం

సుభాష్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): చార్టెడ్ అకౌంటెంట్స్ ఆధ్వర్యంలో మంగళవారం 77వ చార్టెడ్ అకౌంటెంట్ ఫార్మేషన్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ కరీంనగర్ శాఖ సహకారంతో చార్టెడ్ అకౌంటెంట్స్ రక్తదానం చేశారు. చార్టెడ్ అకౌంటెంట్స్ చైర్మన్ రామిడి సంతోష్, కార్యదర్శి బెక్కంటి అజయ్‌కుమార్, వైస్ చైర్మన్ వంగల శేఖర్‌రెడ్డి, రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేశవరెడ్డి, కార్యదర్శి ఊట్కూరి రాధాకృష్ణారెడ్డి, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఎంఎల్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

● సుభాష్‌నగర్: శాతవాహన లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సీఏలు దురిశెట్టి నిరంజన్‌చారి తదితరులను సన్మానించారు క్లబ్ అధ్యక్షుడు దాసరి తిరుపతి రెడ్డి, లైసెన్ ఆఫీసర్ కోమల రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి శుభాకాంక్షలు

భగత్‌నగర్, జూలై 1(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావుకు పార్టీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. రామచందర్‌రావు నాయకత్వంలో రాష్ట్రంలో బీజేపీ మరింత బలోపేతం అవుతుందన్నారు. బీజేపీ పశ్చిమ జోన్ అధ్యక్షుడు జాడి బాల్‌రెడ్డి, మాజీ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

● కరీంనగర్ టౌన్ భారతీయ జనతా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన ఎన్.రాంచందర్‌రావు ఒక విజన్ ఉన్న నాయకుడని, నగర ప్రజల పక్షాన శుభాకాంక్షలు తెలుపుతున్నామని మాజీ మేయర్, బీజేపీ నాయకుడు సునీల్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 40 సంవత్సరాలుగా అకుంఠిత దీక్షతో బీజేపీలో వివిధ హోదాల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు.

● సైదాపూర్: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన రామచంద్రరావుకు సైదాపూర్ మండల బీజేపీ నాయకులు ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు.

క్యారెట్‌తో అమ్మవారికి అలంకరణ

కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నగునూరులోని దుర్గాభవానీ ఆలయంలో కొనసాగుతున్న ఆషాఢమాస శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారిని క్యారెట్ మాలలతో అలంకరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు ఒడిబియ్యం, చీరెసారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ఫౌండర్ చైర్మన్ వంగల లక్ష్మణ్, సభ్యులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గణేశ్‌నగర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వివిధ ప్రాంతాల్లో మరమ్మతు, చెట్ల కొమ్మల తొలగింపులో భాగంగా బుధవారం ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ వన్ ఏడీఈ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సవరన్ స్ట్రీట్, ఎస్వీజేసీ కళాశాల, రామాలయం, ప్రశాంత్‌నగర్, రాణి హస్పిటల్, జానాకి చికెన్ సెంటర్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

● తిమ్మాపూర్: మండలంలోని పలు ప్రాంతాలలో బుధవారం ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మానగర్, చైతన్య కళాశాల, సెయింట్ ఆంథోని స్కూల్, ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్, వెంకటేశ్వర రైస్‌మిల్, శ్రీ హోమ్స్, శంకర్ హోమ్స్ ప్రాంతాలలో ఈ అంతరాయం ఉంటుందని తెలిపారు.

జీప్యాట్‌లో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

తిమ్మాపూర్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీచైతన్య ఫార్మసీ కళాశాల విద్యార్థులు జాతీయ స్థాయి జీప్యాట్ (గ్రాడ్యుయేషన్ ఫార్మసీ అప్టిట్యూడ్ టెస్ట్)లో ప్రతిభ కనబరిచారు. ఈ సందర్భంగా మంగళవారం విద్యాసంస్థల చైర్మన్ ముద్దసాని రమేష్‌రెడ్డి అభినందించారు. జీప్యాట్‌లో దొంత సౌమ్య, భూక్య సౌజన్య, నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యూటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్ (ఎన్ఐపీఈఆర్)లో డి.సౌమ్య, సుచిత్ర, ప్రణీత, ఎంఫార్మసీ ప్రవేశ పరీక్ష టీజీపీజీఈసెట్‌లో సుచిత, ప్రణీత్, గౌతమ్, వర్షితతోపాటు 49 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి ర్యాంకులు సాధించినట్లు రమేష్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామనరసింహారెడ్డి పాల్గొన్నారు.

తరగతిగదులను ప్రారంభించిన డీఈవో

కరీంనగర్ టౌన్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): మనబస్తీ మనబడి కార్యక్రమంలో భాగంగా రూ.50 లక్షల నిధులతో శ్రీనగర్ నూతన పాఠశాల భవన సముదాయంలో నిర్మించిన తరగతి గదులను మంగళవారం డీఈవో మొండయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాడు నరహరి సత్యనారాయణ రెడ్డి, మాజీ కార్పొరేటర్ చాడగొండ బుచ్చిరెడ్డి, సెక్టోరల్ అధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

చల్ల హరిశంకర్‌కు సన్మానం

కరీంనగర్‌టౌన్ జూలై1(ఆంధ్రజ్యోతి): మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకమైన సందర్భంగా చల్ల హరిశంకర్ పటేల్‌ను మంగళవారం మంకమ్మతోటలోని మీకోసం కార్యాలయంలో సన్మానించారు. కార్యక్రమంలో సంఘం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి ఆది మల్లేశం పటేల్, సంఘం రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి సత్తినేని శ్రీనివాస్ పటేల్, నాయకులు బొల్లం లింగమూర్తి పటేల్, మంకమ్మ తోట మున్నూరు కాపు అధ్యక్షుడు ముప్పిడి సునీల్ పటేల్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామరకొండ సంతోష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంటలో కార్మికులు సత్తా చాటాలి

జమ్మికుంట రూరల్, జూన్ 1 (ఆంధ్రజ్యోతి): జూలై 9న సార్వత్రిక సమ్మెలో కార్మికులందరూ పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు గీట్ల ముకుందరెడ్డి అన్నారు. మంగళవారం జమ్మికుంటలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎడ్ల రమేష్, రాజేశం, కొప్పుల శంకర్, జక్కుల రమేష్, ఓదెలు పాల్గొన్నారు.

అన్నదాతలపై శ్రద్ధ వహించాలి

కరీంనగర్ టౌన్ జూలై 1 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని రైతు ప్రజా సంఘాల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు పోలాడి రామారావు కోరారు. మంగళవారం ప్రపంచ వ్యవసాయ దినోత్సవం సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. దేశ స్థూల జాతీయ అభివృద్ధి సూచీకలో అగ్రభాగాన ఉన్న వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించాలన్నారు. అన్నదాతల సంక్షేమంపై దృష్టిసారించాలన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించండి

కరీంనగర్ రూరల్, జూలై 1 (ఆంధ్రజ్యోతి): బొమ్మకల్ సబ్ స్టేషన్ పరిధిలో తలెత్తే విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని దుర్శేడ్ మాజీ ఉప సర్పంచ్ సుంకిశాల సంపత్ రావు కోరారు. మంగళవారం ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రమేష్‌బాబుకు వినతి పత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దుర్శేడ్, గుంటూరుపల్లి, గోపాల్‌పూర్, నల్లగుంటపల్లి, బొమ్మకల్‌కు విద్యుత్ సరఫరా అవుతున్నదని, ఏ ఒక్క గ్రామంలో సమస్య తలెత్తినా మిగతా గ్రామాలకు గంటల తరబడి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని పేరొనాన్నారు. దుర్శేడ్ సబ్ స్టేషన్ నుంచి మిగతా జిల్లాలకు విద్యుత్ సరఫరా అవుతోందని, తమ గ్రామానికి వేరే చోట నుంచి సరఫరా చేస్తున్నారని పేర్కొన్నారు. , దుర్శేడ్‌లో నూతన సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే రెండేళ్ల క్రితం లైన్‌మెన్ సస్పెండ్ కాగా ఇప్పటి వరకు నియమించలేదని, రైతులు వినియోగదారులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం

గన్నేరువరం, జూలై 1 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆఫ్ గన్నేరువరం ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో మండల కేంద్రంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 80మంది కంటి సమస్యలతో బాధపడుతున్నవారు పరీక్షలు చేయించుకున్నారు. అందులో 20మందికి కంటి ఆపరేషన్ అవసరమున్నందున వారిని రేకుర్తి కంటి ఆసుపత్రికి ఉచిత బస్సు సౌకర్యం కల్పించి ఆపరేషన్ కోసం తరలించారు. అనంతరం పోస్టల్ డే, ఫార్మర్స్ డే సందర్భంగా స్థానిక పోస్టల్ ఉద్యోగి జాలి బాల్‌రెడ్డి, రైతు బొడ్డు బాలయ్యను సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు కొలుపుల మోహన్, గ్రామపంచాయతీ కార్యదర్శి వెంకట్ రెడ్డి, బొడ్డు సునీల్, గంప వెంకన్న పాల్గొన్నారు.